క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పెడన: పెనుమల్లి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పెడన ఎంపీపీ రాజులపాటి వాణి గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి అభివృద్ధి నిధులు (సీఎండీఎఫ్) రూ.3 లక్షలు సీసీ రోడ్డు నిర్మాణానికి కేటాయించారని, పనులు త్వరిత గతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మించాలన్నారు. మాజీ ఎంపీపీ అచ్యుతరావు, పెనుమల్లి సర్పంచ్ గరికిపాటి వెంకట రామానాయుడు, సర్పంచ్‌ల సంఘం పెడన అధ్యక్షుడు దావు భైరవలింగం పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ వితరణ

ఈలచెట్లదిబ్బ(నాగాయలంక): గ్రామ పెద్ద చెన్ను వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, కాపీ బుక్స్, డైరీలు, పలకలు, విద్యోపకరణాలు అందజేశారు. హెచ్.ఎం బొప్పన పరమేశ్వరరావు, ఎం. మనోజ్‌కుమార్, కె.సుగుణకుమారి, పీఎంసీ చైర్మన్ చెన్ను యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి గేదె మృతి

కోడూరు: కృష్ణాపురం గ్రామంలోని బావిలో పడి గేదె మృతిచెందింది. కృష్ణాపురం గ్రామానికి వెళ్లే సీసీ రహదారిని అనుకొని బావి ఉండగా.. బుధవారం రాత్రి పాడి గేదె ప్రమాదవశాత్తు అందులో పడిపోయింది. గురువారం తెల్లవారుజామున గ్రామస్తులు బావిలో గేదెను గుర్తించగా.. అప్పటికే అది మృతిచెందింది. జేసీబీ సహాయంతో గేదెను బావి నుంచి బయటకు తీశారు. గేదె యజమాని ఎవరనేది తెలియాల్సి ఉంది.

నిందితులకు 14 రోజుల రిమాండ్

కోనేరుసెంటర్: వీఎం రంగా జయంతి సందర్భంగా ఈనెల 4వ తేదీన మచిలీపట్నం శారదా నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన ఘర్షణలో నిందితులు 20 మందిని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై ఇనుగుదురుపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఘటనలో పాల్గొన్న 20 మందిని నిందితులుగా గుర్తించి అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం 14 రోజులు రిమాండ్ విధించింది.

పెడనలో గంజాయి కలకలం

పెడన: పట్టణంలోని ఓ ఇంట్లో కిలో గంజాయి లభించింది. పోలీసులు 17వ వార్డులోని ఓ ఇంట్లో సోదాలు నిర్వహించి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేయకుండా పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. గంజాయి ఎక్కడి నుంచి తీసుకువచ్చారు, ఎవరు తీసుకువచ్చి ఇచ్చారు అనే విషయాలపై ఆరా తీస్తున్నట్లుగా సమాచారం. పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి పట్టణంలో గంజాయి విక్రయాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆషాఢ సారె సమర్పణ

కోడూరు: సాలెంపాలెం గ్రామంలోని గంగానమ్మ అమ్మవారికి గురువారం ఆషాఢ సారెను సమర్పించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ భక్తులు పట్టుచీర, పూలు, గాజులు, పసుపు, కుంకుమను సారె రూపంలో అమ్మవారికి సమర్పించారు. ముందుగా సారెను గ్రామంలో ఊరేగించారు. పండితుల మంత్రోచ్ఛారణల నడుమ మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఫౌండేషన్ కన్వీనర్ సుబ్బారావు, సభ్యులు పర్యవేక్షించారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి నరసింహారావు

కోడూరు: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని చెప్పారు. మందపాకల సచివాలయం వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మందపాకల, పోటుమీద పంచాయతీల పరిధిలోని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీడీఓ పాండురంగారావు, ప్రత్యేకాధికారి, డీఎఫ్ఓ రాజశేఖర్, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచులు అద్దంకి శివప్రసాద్, ఉప్పాల లక్ష్మీ కనక దుర్గ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీర వెంకట నారాయణరావు పాల్గొన్నారు.

పెడన: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయించి రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని పెడన ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. గురువారం పుల్లపాడు గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. 161 మందికి వివిధరకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు గరికిపాటి వెంకట రామానాయుడు, సర్పంచుల సంఘ నాయకుడు దావు భైరవలింగం, తహసీల్దారు పి. మధుసూదనరావు, ఎంపీడీఓ వి. రెడ్డయ్య, ఈఓపీఆర్డీ జయరాము పాల్గొన్నారు.

సేవలు చేరువ చేసేందుకే..

కె. కొత్తపాలెం(మోపిదేవి): ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరువ కావాలని రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని మండల ప్రత్యేకాధికారి ఎస్. గోవిందు అన్నారు. కె. కొత్తపాలెం సచివాలయం వద్ద సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. 362 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. స్థానికులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఎంపీడీఓ రామలింగేశ్వరావు, తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, గ్రామ కన్వీనర్ మత్తి వెంకట రాజాచంద్, మండల కో–ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు, ఎస్ఐ పద్మ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి..

బంటుమిల్లి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండల, గ్రామ స్థాయి అధికారులు విజయవంతం చేయాలని ఎంపీపీ వి. చినబాబు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పలు శాఖలకు చెందిన అధికారులు తమ నివేదికలు సమర్పించారు. జెడ్పీటీసీ ఎం. వెంకట రమణ, వైస్ ఎంపీపీలు ఓ. చిన్నారిబాబు, కె. లలిత, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టి. శ్రీనివాసరావు, తాహసీల్దార్ సత్యనారాయణమూర్తి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ఏకైక లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీటీసీ మైల రత్నకుమారి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిడమర్రు–1, ఇంతేరు సచివాలయాల్లో నిర్వహించారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో గంగాధర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ కె. బాపూజీ, ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, డీటీ శశికుమార్, సర్పంచ్ మోకమ్మ తదితరులు పాల్గొన్నారు.



మందపాకలలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందిస్తున్న కడవకొల్లు తదితరులు



పుల్లపాడులో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ వాణి



నిడమర్రులో సర్టిఫికెట్ అందిస్తున్న జెడ్పీటీసీ రత్నకుమారి

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

వర్ధంతి కార్యక్రమాల్లో వక్తల నివాళి

కోనేరుసెంటర్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కిట్టు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. అట్టడుగు వర్గాలు కూడా విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చాటిచెప్పిన మహానుభావుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, కార్పొరేటర్ ఎంద్రపాటి నాగేశ్వరరావు, జోగి చిరంజీవి, సర్వజన ఆస్పత్రి డైరెక్టర్ చీలి రవీంద్ర, చిటికిన నాగేశ్వరరావు, తిరుమలశెట్టి ప్రసాద్, బందెల థామస్ నోబుల్ తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుప్తా సెంటర్‌లోని విగ్రహానికి కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నగర నాయకుడు బందెల థామస్ నోబుల్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చీలి రవీంద్ర తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శారదానగర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మాజీ కౌన్సిలర్ కొక్కిలిగడ్డ శరత్ కుమార్, కార్పొరేటర్ యంద్రపాటి నాగేశ్వరరావు నివాళులర్పించారు. ఓగిస్‌పేటలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆ ప్రాంతవాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు గ్రామంలో జగ్జీవన్‌రావ్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ పాలిమెట్ల ఏసుబాబు, నడకుదుటి జనార్దనరావు, కొల్లూరి అప్పారావు, ఎడమల్లి రాజశేఖర్, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అవనిగడ్డ: మాజీ ఉప ప్రధాని దివంగత బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి, స్థానిక 8వ వార్డు వద్ద ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నరసింహారావు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కడవకొల్లు, నాయకులు



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడుతున్న పేర్ని కిట్టు

పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్



వ్యాక్సిన్ వేస్తున్న చల్లపల్లి మండల పశువైద్యాధికారి వినోద్ కుమార్



పెడనలో పెంపుడు కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ బాబూరావు

పెడన: జూనోసిస్ డే సందర్భంగా గురువారం పెడన నియోజకవర్గ వ్యాప్తంగా పశు వైద్యశాలల్లో పెంపుడు కుక్కలకు యాండి రేబిస్ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేశారు. పశు సంవర్ధక శాఖ ఏడీ కొనకళ్ల బాబూరావు పెడనలోని ఆస్పత్రిలో 70 శునకాలకు వ్యాక్సిన్ వేశారు. పెడన పట్టణంలో 70, మండలంలో 47, బంటుమిల్లిలో 102, గూడూరులో 90, కృత్తివెన్నులో 45 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేశామని ఏడీ తెలిపారు.

మోపిదేవి: పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఎం. నందకిషోర్ అన్నారు. మోపిదేవి వెటర్నరీ కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన కుక్కలకు ఉచిత వ్యాక్సిన్ కార్యక్రమాన్ని సర్పంచ్ నందిగం మేరీరాణి, ఉప సర్పంచ్ కోనేరు సుందర సింగ్ ప్రారంభించారు. 57 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. పెదకళ్లేపల్లి సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ గుల్జార్ బేగమ్ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు: పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని గూడూరు వెటర్నరీ క్లినిక్‌లో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు గురువారం ప్రారంభించారు. వైద్యాధికారి బి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ వారం రోజుల పాటు ఆస్పత్రిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు టీకా వేస్తామని చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ తలుపుల వెంకట కృష్ణారావు, రైల్వే బోర్డు సభ్యుడు మోటుపల్లి రత్నారావు, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, లింగం విజయ్, పావురాల ఆంజనేయులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా నగరంలోని రైతుబజారు పక్కన ఉన్న పశువుల వైద్యశాలలో గురువారం పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఉచితంగా వేశారు. జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి ఎంఎస్ఏ దివాకర్ పర్యవేక్షణలో ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు 234 కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డీడీ జేవీ రమణయ్య, వీఏఎస్ వి. హేమారెడ్డి, ఎల్ఎస్ఏ ఎం. రఘురాం, సిబ్బంది పాల్గొన్నారు.

చల్లపల్లి: ప్రపంచ జూనోసిస్ డే వేడుకలు గురువారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో చల్లపల్లి, పురిటిగడ్డ, వక్కలగడ్డ పశు పశువైద్యశాలల్లో 70 పెంపుడు కుక్కలకు యాంటీ రాబీస్ వ్యాక్సిన్ వేశారు. పెంపుడు కుక్కలకు సోకే వ్యాధులు, వాటి నివారణ చర్యలు వివరించి అవసరమైన మందులు అందించారు.

హౌసింగ్ పీడీకి కలెక్టర్ రాజాబాబు అభినందన

మచిలీపట్నంటౌన్: హౌసింగ్ పీడీ జీవీ సూర్యనారాయణను జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు గురువారం అభినందించారు. గృహ నిర్మాణంలో కృష్ణా జిల్లా ద్వితీయ స్థానంలో నిలవడంతో బుధవారం జరిగిన 45వ హౌసింగ్ కార్పొరేషన్ దినోత్సవ రాష్ట్ర స్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో సూర్యనారాయణ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్, ఎండీ లక్ష్మీశా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ రాజాబాబు సూర్యనారాయణను అభినందించారు. కృష్ణా జిల్లాలో గృహ నిర్మాణం 93 శాతం పూర్తి చేసి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో ఉండటంతో పాటు కొద్ది కాలంలోనే బిలో బేస్‌మెంట్ లెవల్ నుంచి బేస్‌మెంట్ లెవల్‌కు 15 వేల గృహాలు తీసుకువచ్చి పూర్తి చేసిన సందర్భంగా కలెక్టర్ సూర్యనారాయణ తో పాటు గృహ నిర్మాణ శాఖలోని ప్రతి ఉద్యోగి సమన్వయంతో పనిచేసి అవార్డును సాధించారని అభినందించారు.

హౌసింగ్ ఉద్యోగులకు అవార్డులు..

పెడన: ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం జరిగిన రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో కృష్ణాజిల్లాలో ఉత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులకు ఉన్నతాధికారులు అవార్డులను అందించారు. కృష్ణాజిల్లా నుంచి జిల్లా హౌసింగ్ పీడీ జీవీ సూర్యనారాయణ, పెడన, గుడివాడ డీఈలు ఎ. శ్రీనివాసరావు, రామోజీనాయక్, కృత్తివెన్ను ఏఈ కేవీకే ఎం సుబ్బారావులున్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్, హౌసింగ్ ఎండీ లక్ష్మీశా నుంచి వీరు అవార్డులను అందుకున్నారు.



సూర్యనారాయణను అభినందిస్తున్న కలెక్టర్ రాజాబాబు

వాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

పెడన: పెడన మార్కెట్‌యార్డు సమీపంలోని బంటుమిల్లి రోడ్డులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఉరివి గ్రామానికి చెందిన దొండపాటి నాగరామారావు (40) గురువారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కుక్క అడ్డురావడంతో సడన్‌గా బ్రేక్ వేశాడు. వాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం బాధితుడిని బంధువులు విజయవాడకు తరలించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పరిశీలన

బంటుమిల్లి: కంచడం గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ (ఎఫ్‌పీసీ) కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర బృందం (స్కాచ్ టీం) సభ్యులు పరిశీలించారు. గ్రామంలోని సబ్ సెంటర్ వద్ద 104 సంచార వాహనం ద్వారా బంటుమిల్లి పీహెచ్ వైద్యులు శిబిరం నిర్వహించారు. ఎఫ్‌పీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ గురుచరణ్, రాష్ట్ర నోడల్ ఆఫీసర్, టీబీ జాయింట్ డైరెక్టర్ టి. రమేష్‌బాబు, జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ విద్యాభారతి, విశ్లేషకులు శివచౌదరి, పరిశోధకులు కొండబైనాలు స్థానిక వైద్యులు పవన్‌కుమార్, సౌందర్యలతో కలిసి పథకం అమలుపై సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించి నాడు–నేడు పథకంలో చేసిన పనులు, సబ్ సెంటర్, 104 వైద్య సేవలు, ఎఫ్‌పీసీ ద్వారా అందుతున్న సేవలపై విచారణ చేశారు. రికార్డులు, పథకం నిర్వహణపై సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు.

పింఛనుదారుల ఔదార్యం

మచిలీపట్నంటౌన్: 28వ డివిజన్‌కు చెందిన చిట్టూరి మరియమ్మ, 29వ డివిజన్‌కు చెందిన ముచ్చర్ల పార్వతి ఇటీవల మృతిచెందారు. 28వ డివిజన్ పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన రూ. 35,600 లను గురువారం మరియమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ మొహమ్మద్ సాహెబ్, సచివాలయ కన్వీనర్ కొమ్ముకూరి రమేష్, గృహ సారథులు పెద్ద ఆదిశేషు, చిన్న ఆదిశేషు, వెంకటేశ్వరరావు, రహమాన్, పండు పాల్గొన్నారు. అలాగే పార్వతి కుటుంబానికి తోటి పింఛనుదారులు సమకూర్చిన రూ. 43,650లను గురువారం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ యర్రా శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

271 ధ్రువీకరణ పత్రాలు అందజేత

కోనేరుసెంటర్: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ, బందరు మండల ప్రత్యేకాధికారి జీవీ సూర్యనారాయణ అన్నారు. చిన్నాపురం, కానూరు గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. చిన్నాపురంలో 192 ధ్రువీకరణ పత్రాలను, కానూరులో గ్రామంలో 79 58 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

ఉత్తమ రైతు కోటేశ్వరరావుకు సన్మానం

లంకతోట(చల్లపల్లి): డాక్టర్ వైఎస్సార్ జయంతి, రైతు దినోత్సవం సందర్భంగా చల్లపల్లి మండలం పాగోలు శివారు లంకతోటకు చెందిన ఉత్తమ రైతు కుందేటి కోటేశ్వరరావు కృష్ణా జిల్లా ఉత్తమ రైతు అవార్డు అందుకున్నారు. కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో విజయవాడలో బుధవారం జరిగిన ఈ వేడుకలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రతి మండలం నుంచి ఒక రైతును ఎంపిక చేయగా, చల్లపల్లి మండలం నుంచి కుందేటి కోటేశ్వరరావు యాదవ్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. కోటేశ్వరరావుకు అవార్డును, రూ. 10వేల నగదు బహుమతిని మంత్రి జోగి రమేష్, రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అందచేశారు.



జోగి రమేష్, నాగిరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కోటేశ్వరరావు

సబ్సిడీపై టమాటాల విక్రయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని రైతు బజారులో సబ్సిడీపై టమాటా విక్రయాలు గురువారం ప్రారంభమయ్యాయి. వ్యవసాయ మార్కెట్ కమిటీ శాఖ ఆధ్వర్యంలో కిలో టమాటా రూ. 50 లకే విక్రయించారు. గురువారం మధ్యాహ్నం 23 క్వింటాళ్ల టమాటా రైతు బజారుకు రాగా రెండు స్టాళ్లు ఏర్పాటు చేసి విక్రయించారు. విక్రయాలను రైతుబజారు ఎస్టేట్ అధికారి అమీర్, సిబ్బంది ఫకీర్, ఆనంద్ పర్యవేక్షించారు.

బోనస్ పంపిణీ

పెడన: కట్లపల్లి పాల సహకార సంఘం పరిధిలోని పాల ఉత్పత్తి దారులకు గురువారం బోనస్ పంపిణీ చేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ సభ్యులు ఆర్జా వెంకట నగేష్ పాల ఉత్పత్తిదారులకు రూ.1,17,810లను అందించారు. గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సంఘ అధ్యక్షుడు వీరంకి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ బసవరాజు, వేతన కార్యదర్శి రాము, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాలకు 12న వేలం

కోనేరుసెంటర్: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎక్సైజ్, ప్రొహిబిషన్ కేసులకు సంబంధించి సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 12వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ పి. జాషువా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేలం జరుగుతుందన్నారు. 19 ద్విచక్ర వాహనాలు, మూడు కార్లు, ఒక లారీకి వేలం జరుగుతుందని చెప్పారు. మరిన్ని వివరాలకు సెల్: 96769 09070, 95733 35070 నెంబర్లను సంప్రదించాలన్నారు.

36 లీటర్ల సారా స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

పెడన: మడక, ఈదుమూడి గ్రామాల్లో పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది సంయుక్తంగా గురువారం దాడులు నిర్వహించారు. కృష్ణా జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ ఆర్. శ్రీహరిబాబు మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు గ్రామ పరిసరాల్లో దాడులు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. 36 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని, 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. దాడుల్లో ఎస్ఈబీ సీఐ ఎం. రామకృష్ణ దాస్, ఎస్ఐ జి. వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

